క్లుప్తంగా

రక్తదానానికి యువత ముందుకురావాలి



రక్తదానం చేస్తున్న యువత

సోంపేట: రక్తదానానికి యువత ముందుకు రావాలని సోంపేట సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.దుర్యోధన అన్నారు. సామాజిక ఆస్పత్రి ఆవరణలో ఎస్.జి.ఎఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో సామాజిక ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఎస్.జి.ఎఫ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చింతామణిట్రస్టు సేవలు ప్రశంసనీయం



రజనీ తల్లికి ఆర్థికసాయాన్ని అందిస్తున్న సర్పంచ్ పూడి లక్ష్మణరావు

కవిటి: చింతామణి ట్రస్టు(హైదరాబాద్) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. ఆదివారం కవిటికి చెందిన పేద విద్యార్థిని దుమ్ము రజనీకి ట్రస్టు తరఫున ఆర్థికసాయానికి ఎంపికచేశారు. సోంపేటలో ప్రభుత్వ సాయంతో ఆమె ఇంటర్మీడియట్ చదువుతోంది. హాస్టల్ ఫీజు నిమిత్తం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండటంతో ట్రస్టునుంచి రూ.10000 ఆర్థిక సాయం అందించినట్లు ట్రస్టు సభ్యుడు, మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్ తెలిపారు. ర్యక్రమంలో పిన్నింటి జయరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు జన్ని లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలకు ఏపీ ఫైబర్‌నెట్



మూలిపాడులో ఇంటర్నెట్ కనెక్షన్ అమర్చుతున్న టెక్నీషియన్లు

మందస: మండలంలోని సచివాలయాలకు ఏపీ ఫైబర్‌నెట్ అమర్చే పనులు శరవేగంగా పనులు జరుగుతున్నాయి. సొండిపూడి సచివాలయం, మూలిపాడు పంచాయతీల్లో ఆదివారం ఏపీ ఫైబర్‌నెట్ కనెక్షన్ సాంకేతిక నిపుణులు ఇన్‌స్టాల్ చేశారు. సచివాలయాలతో పాటు పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలకు కూడా నెట్ కనెక్షన్లు ఇవ్వనున్నట్టు టెక్నీషియన్లు చెప్పారు. మందస మండలంలో అన్ని సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు అధిక వేగంతో పని చేసే ఇంటర్నెట్‌ను అందజేస్తున్నట్టు వారు తెలిపారు.

వేగవంతంగా పైపులైన్ల ఏర్పాటు



ప్రైవేటు స్థల యజమానులతో చర్చిస్తున్న ఆర్‌డీఓ సీతారామ్మూర్తి

కంచిలి: ఉద్దానం పైపులైన్ల ఏర్పాటు ప్రక్రియలో భాగంగా ప్రైవేటు స్థలాల యజమానులకు పరిహారం అందివ్వనున్నట్లు టెక్కలి ఆర్‌డీఓ టి.సీతారామ్మూర్తి తెలిపారు. ఈ మేరకు ఆదివారం తహశీల్దార్ ఎస్.హైమావతితో కలిసి కంచిలిలో పలు ప్రైవేటు స్థలాల్లో చేపడుతున్న పైపులైన్ల పనులను పరిశీలించారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఉద్దానం పథకాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో పైపులైన్లు ఏర్పాటు పనుల్ని వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల జె.సి.ఎస్.కన్వీనర్ కె.సురేష్, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నౌపడలో పాలపోలమ్మతల్లి సంబరాలు



ఆకట్టుకున్న పగటివేషాలు

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడలో పాల పోలమ్మతల్లి బల్లోల సంబరాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని విద్యుత్ దీప అలకరణలతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. పగటివేషాలు ఆకట్టుకున్నాయి. మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. రాత్రి పలు పౌరాణిక నాటకాల ప్రదర్శన నిర్వహించారు.

శాంతిభద్రతలకే ప్రాధాన్యం



టెక్కలి డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి

- పట్టుదలే పోలీస్ అధికారిగా మార్చింది
- సైబర్ నేరాలు, చైన్ స్నాచింగ్ పట్ల అప్రమత్తం
- పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి అవసరం
- టెక్కలి సబ్ డివిజన్ డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి

సాక్షి ఇంటర్వ్యూ

టెక్కలి: సామాన్య వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించారు. వైద్య విద్యను విజయవంతంగా పూర్తి పూర్తి చేశారు. అయినా పోలీస్ కావాలనే కోరికతో గ్రూప్ పరీక్షలను రాసి డీఎస్పీగా ఎంపికయ్యారు. ఆయనే టెక్కలి సబ్ డివిజన్‌లో ఇటీవల డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డి.బాలచంద్రారెడ్డి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురంలో డీఎస్పీగా మొదటి పోస్టింగ్‌లో చేరిన తర్వాత అమలాపురం అల్లర్లు, అమరావతి రైతుల పాదయాత్ర ఘటనలను సమర్థంగా ఎదుర్కొన్నారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయాల్లో భాగంగా టెక్కలిలో ఇటీవల డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణ, పిల్లల పట్ల తల్లిదండ్రుల బాధ్యత, సమాజ శ్రేయస్సులో యువత పాత్ర, సైబర్ నేరాలు, అనుకున్న లక్ష్యాన్ని ఏ విధంగా సాధించాలి అనే విషయాలను 'సాక్షి'తో ఆయన పంచుకున్నారు.

సాక్షి: మీ సొంత ప్రాంతం.. కుటుంబ నేపథ్యం?

డీఎస్పీ: వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు స్వగ్రామం. మాది సాధారణ వ్యవసాయ కుటుంబం. తండ్రి వెంట్రామిరెడ్డి, తల్లి సరస్వతి. మేము ముగ్గురు సంతానం. వ్యవసాయంపై జీవనోపాధి కొనసాగిస్తూ మమ్మల్ని ప్రయోజకుల్ని చేశారు.

సాక్షి : వైద్య విద్యను పూర్తి చేసి పోలీస్ వృత్తికి రావడానికి కారణం?

డీఎస్పీ: 2009 ఎంసెట్‌లో 416వ ర్యాంకు సాధించాను. కర్నూలు మెడికల్ కళాశాలలో 2015లో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. పోలీస్ వృత్తిపై ఆసక్తితో గ్రూప్ పరీక్షలకు సిద్ధమై 2018లో డీఎస్పీగా ఎంపికయ్యాను. 2020 వరకు అనంతపురంలో శిక్షణ పొందాను. ఆ తరువాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురంలో డీఎస్పీగా మొదటి పోస్టింగ్‌లో చేరాను. 2020లో వివాహం జరిగింది.

సాక్షి: మొదటి పోస్టింగ్‌లో ఎటువంటి ఘటనలు ఎదుర్కొన్నారు?

డీఎస్పీ: రామచంద్రాపురంలో డీఎస్పీగా మొదటి పోస్టింగ్‌లో చేరిన తరువాత కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో అమలాపురం అల్లర్లు, అమరావతి రైతుల పాదయాత్ర సంఘటలను సమర్థవంగా ఎదుర్కొన్నాం.

సాక్షి: రెండో పోస్టింగ్‌లో టెక్కలి డీఎస్పీగా బాధ్యతలు ఎలా ఉన్నాయి?

డీఎస్పీ: రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఏర్పడిన పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయాల్లో భాగంగా టెక్కలిలో కొత్తగా ఏర్పాటైన పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయానికి డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉంది. టెక్కలి, పాతపట్నం, కొత్తూరు, నరసన్నపేట సర్కిల్ పరిధిలో నేరాలు, శాంతిభద్రతల పరిరక్షణ, ఆంధ్రా–ఒడిశా సరిహద్దు పరిస్థితులపై కొంత మేరకు అవగాహన కలిగింది.

సాక్షి: మోసాలపై ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలి?

డీఎస్పీ: నేరాల విషయంలో నిందితులు కొత్త రకం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుంటారు. ఇటీవల సైబర్ నేరాలు అధికమవుతున్నాయి. మొబైల్‌లో అనవసరమైన వెబ్ లింకులను ఓపెన్ చెయ్యకూడదు. కొన్ని సందర్భాల్లో సైబర్ నేరాల వల్ల ఖాతాల్లో డబ్బులు పోతే.. తక్షణమే 1930కు సంప్రదించాలి. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరాలు, చైన్‌స్నాచింగ్‌పై అప్రమత్తంగా ఉండేందుకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

సాక్షి: యువత నేరాల బారిన పడకుండా ఏం చేయాలి?

డీఎస్పీ: యువత వివిధ రకాల నేరాల భారిన పడడానికి ప్రధానంగా సెల్‌ఫోన్ కారణంగా చెప్పవచ్చు. చదువుకునే పిల్లలు అడిగారని తల్లిదండ్రులు ఖరీదైన సెల్‌ఫోన్లు కొనిస్తున్నారు. కొన్ని రకాల ఆన్‌లైన్ గేమ్స్, ఇతర అనవసరమైన వెబ్‌సైట్‌లతో దురలవాట్లకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో మత్తు పదార్థాలకు బానిసగా మారి ఆ మత్తులో ఘోరమైన నేరాలకు పాల్పడే ఘటనలు చూస్తున్నాం. పిల్లల నుంచి సెల్‌ఫోన్ దూరం చేసే ఆలోచన చేయాలి. కళాశాలలకు వెళ్తున్న పిల్లల ప్రవర్తన పట్ల ప్రత్యేక దృష్టి వేయాలి. పిల్లలు అడిగారని విచ్చలవిడిగా డబ్బులు ఇవ్వడం మానేసి వారి భవిష్యత్ అవసరమైన మంచిని వివరించాలి. సమాజ శ్రేయస్సు కోసం యువత ఆలోచన చేయాలి.

సాక్షి: శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యత ఎలా?

డీఎస్పీ: టెక్కలి డీఎస్పీ కార్యాలయం పరిధిలో సిబ్బంది సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణ, సైబర్ నేరాల అదుపు, రోడ్డు ప్రమాదాల నివారణ, చైన్‌స్నాచింగ్, ట్రాఫిక్ నియంత్రణ, వివిధ రకాల నేరాలను నియంత్రించేందుకు కృషి చేస్తాను. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా వేస్తాం. సమాజాభివృద్ధిలో ప్రజలు, యువత బాధ్యత వహించే విధంగా అవగాహన కల్పిస్తాం.

కార్యకర్తలకు అండగా ఉంటా



కోటబొమ్మాళిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న దువ్వాడ వాణి

- వైఎస్సార్ సీపీ నాయకురాలు దువ్వాడ వాణి

కోటబొమ్మాళి: కార్యకర్తలకు అండగా ఉంటానని, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకురాలు దువ్వాడ వాణి పిలుపునిచ్చారు.ఆదివారం కోటబొమ్మాళి–కొత్తపేట రెడ్డి కల్యాణ మండపంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, దాదాపు ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని చెప్పారు. గత ఎన్నికల్లో రిగ్గింగులు, దౌర్జన్యాలతో టెక్కలిలో కింజరాపు అచ్చెన్నాయుడు గెలిచారని, ఈసారి ఎన్నికల్లో ఓడించేందుకు పార్టీ శ్రేణులంతా బాధ్యతగా పని చేయాని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు రొక్కం సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ గతంలో కింజరాపు ఎర్రన్నాయుడు కిల్లి కృపారాణి చేతిలో, అచ్చెన్నాయుడు కొర్ల భారతమ్మ చేతిలో, అదే సెంటిమెంటుతో రానున్న ఎన్నికల్లో అచ్చెన్నాయుడు ఓడించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళీధర్, వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ దుంగ శిమ్మన్న, సీనియర్ నాయకుడు సంపతిరావు రాఘవరావు, సర్పంచ్‌లు రాంపాత్నని సావిత్రి, నూక సత్యరాజ్, కవిటి రామరాజు, బొడ్డు వెంకటరమణ, బమ్మిడి గణపతి, సుంకరి జనార్దన, కె.కృష్ణమూర్తి, ఎస్.వి.రమణ, ఎంపీటీసీ బగాది దివాకర్, చుక్క లోకనాథం, బమ్మిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బోరుభద్రలో అక్రమ లేఅవుట్లు!



నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఅవుట్

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్రలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. బోరుభద్రలో సర్వే నెంబర్ 126–2, 3, 4లో 1 ఎకరా 56 సెంట్లలో అనుమతి లేకుండా లేఅవుట్ వేసి విక్రయిస్తున్నారు. పంచాయతీ, రెవెన్యూ, సుడా అధికారులు అనుమతి లేకుండా ఇష్టానుసారంగా రియల్టర్లు వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం లేఅవుట్ వేసే ముందు వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు రెవెన్యూ అధికారుల ద్వారా అనుమతి తీసుకోవాలి. అనంతరం ప్లాట్లు వేసేందుకు ప్లానింగ్ అధికారులు అనుమతులు పొందాలి. వారు లేఅవుట్ భూములను పరిశీలించి అనుమతులు ఇస్తారు. సామాజిక అవసరాల నిమిత్తం 10 శాతం భూమిని పంచాయతీకి కేటాయించాల్సి ఉంది. కొలతల ప్రకారం రోడ్డు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి. అయితే స్థానికంగా అటువంటివి ఏమీ కనిపించడం లేదు. రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం విలువ ప్రకారం 14 శాతం స్టాంప్ డ్యూటీ చలానా తీసి పంచాయతీకి అందజేయాలి. ఇక్కడ అలాంటిది ఏమీ చేయకుండా లక్షల రూపాయల పంచాయతీ ఆదాయానికి గండి కొట్టారు. ఈ విషయమై వీఆర్వో నాగరాజు వద్ద ప్రస్తావించగా లేఅవుట్‌కు సంబంధించి కన్వర్షన్ దరఖాస్తు రాలేదన్నారు. పంచాయతీ కార్యదర్శి వినోద్‌కు వద్ద ప్రస్తావించగా ఎటువంటి పర్మిషన్ తీసుకోలేదని, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. సుడా అధికారి పి.వెంకటేష్ వద్ద ప్రస్తావించగా సుడా నుంచి ఎటువంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు.

తీరప్రాంత భౌగోళిక పరిస్థితిపై ఆరా



సీహెచ్ కపాసుకుద్ది తీరంలో అధికారులు

కవిటి: రాష్ట్ర పర్యాటకశాఖ, మత్స్యశాఖ సంయుక్తంగా అభివృద్ధి చేయనున్న తీరప్రాంత పర్యాటక అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించి ఆయా శాఖల అధికారులు ఆదివారం కవిటి మండలంలో విస్తృతంగా పర్యటించారు. కళింగపట్నం, ఇద్దివానిపాలెం, పెద్దకర్రివానిపాలెం, కొత్తపాలెం, పుక్కళ్లపాలెం, సీహెచ్ కపాసుకుద్ది తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి స్థానిక స్థితిగతులపై ఆరా తీశారు. పర్యాటక, మత్స్యశాఖల కమిషనర్‌ల ఆదేశాల మేరకు ప్రొఫెసర్ డాక్టర్ పి.ఆనంద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి నడిమింటి నారాయణరావు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు టి.సంతోష్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ కాయ భీమసేను, మాజీ వైస్ సర్పంచ్ ఆరంగి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశమైన గెస్ట్ ఫ్యాకల్టీలు

టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ జిల్లా ప్రతినిధి టి.చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ కళాశాలల గెస్ట్ ఫ్యాకల్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల సాధనకు ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. బదిలీల్లో ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అనంతరం భవిష్యత్ కార్యచరణపై ప్రణాళిక రూపొందించారు. సమావేశంలో గెస్ట్ ఫ్యాకల్టీలు రామారావు, జగన్, పార్వతి, ప్రసన్న, లలితాబాయి, తరుణ్, వెంకట్, కసవయ్య, మల్లేశ్వరరావు, సత్యనారాయణ, తిరుమల, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాల వర్తింపే ధ్యేయం



పెద్దకొజ్జిరియాలో వివరాలు సేకరిస్తున్న సర్పంచ్, సచివాలయ కన్వీనర్



బ్రాహ్మణతర్లాలో సమస్యలు అడిగితెలుసుకుంటున్న నాయకులు, అధికారులు

కంచిలి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు వర్తింపు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని పెద్దకొజ్జిరియా సర్పంచ్ పొందల ఢిల్లీరావు అన్నారు. పెద్దకొజ్జిరియా గ్రామంలో ఆదివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఆదివారం సర్వే చేపట్టారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సచివాలయ వైఎస్సార్ సీపీ కన్వీనర్ ప్రధాన లజపతిరాయ్, పాసాల ఉపేంద్ర, నరసయ్య, సత్యం పాల్గొన్నారు.

కాశీబుగ్గ/పలాస: బ్రాహ్మణతర్లా గ్రామంలో పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు పైల వెంకటరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. సర్పంచ్ బాడాన పుష్ప, ఎంపీటీసీ తుంగాన రవణమ్మ, ఉప సర్పంచ్ పొందర ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ దంతం వైకుంఠరావు, వార్డ్ మెంబర్స్, గృహ సారథులు, మాజీ ఎంపీటీసీ కర్ర గంగాధర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



పెద్దకొజ్జిరియాలో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు అభిమానులు అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో ఆయా కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పార్టీ నేతలు ఆదివారం పరామర్శించారు. కొనక గ్రామానికి చెందిన సర్పంచ్ హరిబంధు జన్ని సోదరుడు భరత్ జన్నీ(36), ఎక్కల గ్రామానికి చెందిన బర్ల బాలకృష్ణ తల్లి బర్ల కుందనమ్మ(53), పెద్దకొజ్జిరియా గ్రామానికి చెందిన బొడ్డ సుబ్బారావు తల్లి బొడ్డ బువ్వమ్మలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆయా కుటుంబాలను ఎంపీపీ పరామర్శించారు. ఆయనతోపాటు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కె.సురేష్, పొందల ఢిల్లీరావు, రంగాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

28వ వార్డులో శానిటేషన్ డ్రైవ్



పనులు పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్ రాము

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 28వ వార్డు పరిధిలో ఆదివారం కౌన్సిలర్ బోనెల రాము ఆధ్వర్యంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎన్నో రోజులుగా డ్రైనేజీ చెత్తతో కూరుకుపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో మంత్రి ఆదేశాలతో చర్యలు చేపట్టారు.

వర్షంతో రైతుల్లో హర్షం

వజ్రపుకొత్తూరు రూరల్ : ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధమవుతున్న తరుణంలో వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రైతులు నారు మడులను సిద్ధం చేశారు. విత్తనాలు వేసేందుకు వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. ఆదివారం కురిసిన వర్షానికి పూండిగల్లి, బెండి గేట్, కిడిసింగి వద్ద రహదారులు జలమయమయ్యాయి.

కృష్ణావతారంలో జగన్నాథుడు



ఇచ్ఛాపురం: పూజలందుకుంటున్న జగన్నాథుడు



కాశీబుగ్గ: పరశురామ అవతారంలో జగన్నాథుడు

ఇచ్ఛాపురం: జగన్నాథ రథయాత్రలో భాగంగా గుడించా మందిరంలో కొలువైన జగన్నాథుడు కాళీయ మర్దన శ్రీకృష్ణునిగా, బలభద్రుడు బలరామునిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు తులసీ దళాలతో ప్రత్యేక పూజలు చేశారు.

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ గుండిచా మందిరంలో జగన్నాథుడు ఆదివారం పరుశురామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గోగుల్ చంద్రదాస్, బాబూరావు పండాల అర్చకత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'అత్యవసర పరిస్థితి' చీకటి అధ్యాయం



నిరసన తెలియజేస్తున్న కొర్రాయి బాలకృష్ణయాదవ్

కాశీబుగ్గ: దేశంలో 1975 జూన్ 25న విధించిన అత్యవసర పరిస్థితి దేశచరిత్రలోనే చీకటి అధ్యాయంగా నిలిచిపోతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ యాదవ్ అన్నారు. పలాసలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ విపక్ష నేతలపై విరుచుకుపడి కారాగారాల్లో నిర్బంధించడం, పౌర హక్కులను కాలరాయడం, ప్రాథమిక హక్కులను భంగం కలిగించడం, పత్రికా స్వేచ్ఛను క్రూరంగా నియంత్రించడం వంటి చర్యలకు ఉపక్రమించారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో నల్ల వస్త్రాలు ధరించి నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపు తగదు

వజ్రపుకొత్తూరు రూరల్ : కేంద్ర ప్రభుత్వ సంస్కరణలతో పెరిగిన విద్యుత్ చార్జీల పట్ల ఈ నెల 30న విద్యుత్ సబ్‌స్టేషన్‌ల వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, ఎన్.మోహన్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు నగరంపల్లిలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు కరెంట్ వాడకంపై రూ.13 వేల కోట్లు ట్రూఆప్ చార్జీలు పేరుతో వినియోగదారునిపై అదనపు భారం మోపారని విమర్శించారు. ఖరీదైన స్మార్ట్ మీటర్లు పెట్టి అదానీ లాంటి కంపెనీలను పెంచి పోషిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు భానుమతి, జి.సుగుణవతి, ఈశ్వరమ్మ, రామకృష్ణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరన



హెచ్‌ఎంకు ఫ్యాన్లు అందజేస్తున్న సర్పంచ్ అప్పలస్వామి

కోటబొమ్మాళి: మండలంలోని చీపుర్లపాడు ప్రాథమికోన్నత పాఠశాలకు సర్పంచ్ నేతింటి అప్పలస్వామి రెండు టేబుల్ ఫ్యాన్లను ఆదివారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్, వార్డు సభ్యులు వాన చిన్నవాడు, బొడ్డు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.